## క్లుప్తంగా

### ఖాయమైన వైఎస్సార్ సీపీ విజయం

రామచంద్రపురం: రాష్ట్ర వ్యాప్తంగా భారీగా పోలింగ్ జరగడంతోనే వైఎస్సార్ సీపీ విజయం ఖాయమైందని పార్టీ నేత, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తొగరు మూర్తి అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మహిళలకు చేసిన మేలుకు రుణం తీర్చుకుంటూ ఓటుతో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. గత ఎన్నికల్లో 87 శాతం ఓట్లతో రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించిందని, ఈ సారి 90 శాతం ఓట్లతో రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్ విజయం సాధిస్తున్నారని మూర్తి తెలిపారు.

### పరీక్షా ఫలితాల్లో నవోదయ విద్యాలయ రికార్డు

యానాం: 10వ, 12వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజెల్ 98.40 శాతంతో ప్రథమ, ఎస్ఎస్‌వీ సాయిప్రణీత్ 94.50 శాతంతో ద్వితీయ, వి.త్రినయ్ సాయిచరణ్ 94.30 శాతంతో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80 శాతం, ఆదిత్య రంజన్‌నాగ్ 91 శాతం, పి.ప్రశాంత్‌కుమార్ 90.60 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో పరీక్ష రాసిన 34 మంది విద్యార్థులందరూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యాలయ చరిత్రలోనే ఇది అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

### సీఎం రంగసామికి పనసకాయల అందజేత



సీఎం రంగసామికి పనస కాయలను అందజేసిన ఎమ్మెల్యే కల్యాణసుందరం

యానాం: పుదుచ్చేరి రీజియన్ పరిధిలోని కాలపట్టు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న శాసనసభ్యుడు కల్యాణ సుందరం సీఎం రంగసామికి సోమవారం పనసకాయలు అందజేశారు. కల్యాణసుందరం తన పొలంలో పనసతో పాటు అరటి, మామిడి తదితర ఉద్యానవన పంటలను పండిస్తున్నారు. అదే విధంగా అందమైన మొక్కలు, పుష్పాలతో కూడిన గార్డెన్‌ను ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఆయన తన పొలంలో పండిన పండ్లను మిత్రులకు, సహచర శాసనసభ్యులకు ఏటా పంపిస్తుంటారు. తాజాగా సీఎం రంగసామికి అందజేశారు.

### వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నిత్య హోమాలు, అర్చన, లక్ష్మీ హోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు జరిపారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఎండీలు రవికిరణ్ వర్మ, శశికిరణ్ వర్మ దంపతులు కల్యాణం జరిపించారు. మంగళవారం ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

### కరప మండలంలో 80 శాతం పోలింగ్

కరప: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చెదురు మదురు సంఘటనలు మినహాయించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ ముగిసింది. కొన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఉదయం కొంతసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. సరాసరిన 80 శాతం ఓటింగ్ నమోదయింది. మండలంలోని 23 గ్రామాల్లో ప్రజలు 66 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 64,475 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 51,580 మంది ఓటు వేశారు. మండలంలోని కరప, కూరాడ, వాకాడ, వేళంగి గ్రామాల్లో 89 శాతం నమోదైంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు తదితరులు మండలంలో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.



మండపేటలో ఓటు వినియోగించుకున్న ఎమ్మెల్సీ తోట



ఓటు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి



అంగరలో ఓటు వేసేందుకు వృద్ధుడిని వీల్ చైర్లో తీసుకెళుతున్న ఓటర్లు



అంగరలో ఓటు వేసేందుకు చంటి బిడ్డలతో వచ్చిన మహిళలు , పడమర ఖండ్రికలో కర్ర ఊతంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు

# ఉత్సాహంగా పోలింగ్

- నియోజకవర్గంలో 76.56 శాతం నమోదు
- మండపేటలో ఓటు వేసిన ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల
- పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన ఆర్వో ఎల్లారావు
- అంగర 168 కేంద్రంలో ఈవీఎం మొరాయింపు
- సమయం ముగిసినా బారులు తీరిన ఓటర్లు

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాలు, రాయవరంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురంలోని 19 గ్రామాలు మొత్తం 43 గ్రామాలు, పట్టణంలోని 30 వార్డుల్లో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. నియోజకవర్గంలో 223 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కాగా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలోని 186 పోలింగ్ కేంద్రంలో మొదటి ఓటు వేసేందుకు ఓటరు సిద్ధమవ్వగా ఈవీఎం మొరాయించింది. దీంతో సంబంధిత అధికారి పర్యవేక్షణలో మరో ఈవీఎంను అమర్చారు. సుమారు 45 నిమిషాలు పాటు పోలింగ్ ఆలస్యమైంది.

**పక్కా ఏర్పాట్లతో...**

నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి ఎల్లారావు పర్యవేక్షణలో 24 రూట్లుగా పోలింగ్ ఏర్పాట్లు చేశారు. 446 ఈవీఎంలను సిద్ధం చేయడంతో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించే వీలు కలిగింది.

**తొలి నుంచీ ఉత్సాహమే..**

పోలింగ్ ప్రారంభ సమయానికే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. ఎండ వేడి పెరుగుతుందన్న భావనతో వృద్ధులు ఉదయాన్నే ఓటు వేసేందుకు ప్రాధాన్యతనిచ్చారు. మధ్యాహ్న సమయంలో కాస్త ఓటర్ల సంఖ్య తగ్గినప్పటికీ మూడు నుంచి నాలుగు గంటలు సమయంలో కేంద్రాల్లో క్యూలైన్లు బారులు తీరాయి. సాయంత్రం సమయం ముగిసినప్పటికీ లైన్లో ఉన్న ఓటర్లను అనుమతిస్తూ బయట గేట్లు వేశారు. కొన్ని కేంద్రాల్లో రాత్రి సమయం కూడా పోలింగ్ కొనసాగింది.

**మహిళ ఓటర్లలో చైతన్యం ..**

పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలే ఎక్కువగా కనిపించారు. పురుషులు క్యూలైన్లు కంటే మహిళల లైన్లు ప్రతి సమయంలోనూ రద్దీగానే కొనసాగాయి. నియోజకవర్గంలో 1,13,263 మంది మహిళా ఓటర్లు ఉండగా సాయంత్రం 5 గంటలు సమయానికి 87,698 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటలకు పురుషులు 30,918 మంది ఓటు హక్కును వినియోగించుకోగా మహిళలు 32, 274 మంది ఓటు వేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 48, 549 మంది పురుషులు ఓటు వేయగా 52,223 మంది మహిళలు ఓటు వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు 64,897 మంది పురుషులు ఓటు వేయగా 70,390 మంది మహిళలు తమ ఓటు హక్కును ఓటు వేశారు. సాయంత్రం 4 గంటలకు 69,588 మంది పురుషులు ఓటు వేయగా 76,021 మంది మహిళలు తమ ఓటును వేశారు. సాయంత్రం 5 గంటలకు 81, 121 మంది పురుషులు ఓటు వేయగా 87,698 మంది మహిళలు ఓటు వేశారు. ఉదయం 9 గంటల నమోదు మినహా ప్రతి దశలోనూ ఓటు వేసినవారిలో మహిళా ఓటర్లు సంఖ్యే ఎక్కువగా నమోదైంది.

**మండపేటలో..**

మండపేట: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండపేట నియోజవర్గంలో చిన్న చిన్న సంఘటన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ ముగిసిన 6 గంటలకు సుమారు 81.26 శాతం పోలింగ్ నమోదు అయినట్టు ఎన్నికల అధికారి ఎల్లారావు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి ఓటర్‌లో మండపేట పట్టణం నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు వేయడానికి బారులు తీరారు. ఉదయం తొమ్మిది గంటలకు 12 శాతం 11 గంటలకు 28 శాతం ఒంటి గంటకు 45.70 శాతం మూడు గంటలకు 61.35 శాతం నాలుగు గంటలకు 66.03 శాతం ఐదు గంటలకు 76.56శాతం పోలింగ్ ముగిసిన 6 గంటలకు 81.26శాతం ఓటింగ్ నమోదైంది. మండపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు దంపతులు సత్య శ్రీరోడ్‌లోని ఎస్వీఆర్ మున్సిపల్ హైస్కూల్ 105 పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంకసాని చెరువుగట్టు వద్దన్న గౌతమి మున్సిపల్ హైస్కూల్ 74వ పోలింగ్ కేంద్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు దంపతులు ఓటు వేశారు. కపిలేశ్వరపురం మండలం నేలటూరి గ్రామంలో చిన్న సంఘటన, కోరుమిల్లి గ్రామంలో దొంగ ఓట్లు వేస్తున్నారని ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఉదయం రావులపేటలో ఈవీఎం మొరాయించడంతో గంటసేపు ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. అప్పటికే అక్కడ ఓట్లు వేయడానికి ఓటర్లు బారులు తీరారు. నియోజకవర్గంలో మొత్తం 2,20,494 మంది ఓటర్లు ఉన్నారు. 223 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. మండపేట నియోజకవర్గంలో పోలింగ్ ముగిసే సమయానికి 82.26 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ ముగిసే సరికి రాత్రి పది గంటలు అవుతుందని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లేడ్ లైట్లు ఏర్పాటు చేశారననారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను అమలాపురంలోని కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారు. అక్కడ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఈవీఎంలు భద్రపరుస్తారు. జూన్ 4వ తేదీన ఓట్లు లెక్కింపు అక్కడే చేపడతారు.



మండపేటలో ఓటు వేయదానికి బారులు తీరిన ఓటర్లు

**మండపేట నియోజకవర్గంలో పోలింగ్ శాతం వివరాలు**

| సమయం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|---|
| ఉదయం 9 గంటలకు | 14,188 | 13,055 | -- | 27,243 | 12.36 |
| ఉదయం11 గంటలకు | 30,918 | 32,274 | -- | 63,192 | 28.66 |
| మధ్యాహ్నం ఒంటి గంటకు | 48,549 | 52,223 | -- | 1,00,772 | 45.70 |
| మధ్యాహ్నం 3 గంటలకు | 64,897 | 70,390 | 02 | 1,35,289 | 61.35 |
| సాయంత్రం 4 గంటలకు | 69,588 | 76,021 | 02 | 1,45,611 | 66.03 |
| సాయంత్రం 5 గంటలకు | 81,121 | 87,698 | 02 | 1,68,821 | 76.56 |



రామచంద్రపురం మండలం కాపవరంలో ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వచ్చిన 105 ఏళ్ల వృద్ధుడు



ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్



జగన్నాయకులపాలెంలో ఓటు వేసేందుకు సాయంత్రం 6 గంటల సమయంలోనూ క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు



కుటుంబ సభ్యులతో కలిసి రామచంద్రపురం పట్టణంలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి సుభాష్ తదితరులు

# పోటెత్తిన ఓటర్లు

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం
- బారులు తీరిన ఓటర్లు
- 90 శాతం దాటిన ఓటింగ్

రామచంద్రపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా రామచంద్రపురం నియోజకవర్గంలో భారీ పోలింగ్ నమోదు అవుతుంది. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. నియోజకవర్గం మొత్తం మీద చెదురు మదురు సంఘటనలు మినహ పోలింగ్ ప్రశాతంగా జరిగింది. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం మాక్ పోలింగ్ అనంతరం రామచంద్రపురం పట్టణంలో కొద్ది ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా ఓటర్లు ఓటు వేసేందుకు తరలి వచ్చారు. నియోజకవర్గం మొత్తం మీద సాయంత్రం 6 గంటల వరకు దాదాపు 82.99 శాతం పోలింగ్ నమోదైంది. రామచంద్రపురం పట్టణంలోని రెండు బూత్‌లతో పాటుగా కె.గంగవరం మండలం, రామచంద్రపురం మండలం, కాజులూరు మండలాల్లో కొన్ని బూత్‌లలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. అయితే పోలింగ్‌శాతం ఇంకా పెరిగే అవకాశం ఉంది. టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ తన కుటుంబ సభ్యులతో కలిసి చప్పిడివారి సావరంలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

**ప్రశాంతంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు**

కాజులూరు: మండల గ్రామాలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 26 పంచాయతీలకు అధికారుల 70 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకూ క్యూలైన్‌లోకి వచ్చిన ఓటరులను అధికారులు అనుమతించారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. కాగా ఆర్యావటం 113 పోలింగ్ బూత్‌లో టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య విభేదాలు చోటుచేసుకుని ఘర్షణ వాతావరణానికి దారితియ్యడంతో అధికారులు కొద్దిసేపు పోలింగ్ నిలిపివేసి కేంద్రాన్ని మూసివేశారు. కాజులూరులోనూ, గొల్లపాలెంలోనూ కార్యకర్తలు ఘర్షణకు దిగగా పోలీసులు రంగ ప్రవేశంచేసి అల్లరి మూకలను చెదరగొట్టారు. వృద్ధులు, వికలాంగులు ఓట్లు వేసేందుకు స్థానికులు, పోలీసులు సహాయసహకారాలు అందించారు.

రామచంద్రపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలు 2024లో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో సాయంత్రం 6.30 గంటలకు వచ్చిన నివేదికల ప్రకారం 82.99 శాతం పోలింగ్‌తో రామచంద్రపురం నియోజకవర్గం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. మహిళా ఓటర్లు వెల్లివిరిసిన చైతన్యంతో బారీ క్యూలైన్లలో వేచి ఉండి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్త ఓటర్లుగా నవతరం యువతీ, యువకులు ఉత్సాహంగా ఓటు వేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఆయన కుమారుడు రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌లు తమ స్వగ్రామం హసన్‌బాదలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామచంద్రపురం మండలంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాతంగా జరిగింది.

**కె.గంగవరం మండలంలో..**

కె.గంగవరం: మండలంలోని 65 పోలింగు కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. మసకపల్లి, పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాలు ఒకరిపై ఒకరు దూషణలకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని తరిమికొట్టి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూశారు.



రామచంద్రపురం పట్టణంలో పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు



రామచంద్రపురం రూరల్ మండలంలో మహిళా ఓటర్ల చైతన్యం



ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు, వృద్ధురాలు



ఆర్యావటం 113 పోలింగ్ బూత్‌లో ఘర్షణల నేపథ్యంలో కొద్దిసేపు పోలింగ్ కేంద్రాన్ని మూసివేసిన అధికారులు

# ఆనందంలో యువత

కపిలేశ్వరపురం: జీవితంలో కొన్ని మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయి. తొలిసారి ఓటు వేసిన యువత ఎంతో మధురానుభూతిని పొందారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగానూ, అధికశాతంగానూ నమోదు కాగా తొలిసారి ఓటు హక్కును పొందిన యువత ఉత్సాహంగా ఓటును వేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఆన్‌లైన్‌లో యువత పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును దక్కించుకున్నారు. అదే ఉత్సాహంతో సోమవారం సార్వత్రిక ఎన్నికల్లో ఓటును వేశారు. 18-29 సంవత్సరాల వయస్సు ఉన్న యువత మండపేట నియోజకవర్గంలో 22,088 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 18,766, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో 1,42,231 మంది యువత ఓటు హక్కును కలిగి ఉన్నారు. వారిలో అత్యధిక శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేతివేలికి పూసిన సిరా చుక్కను చూసి మురిసిపోయారు.



అంగరలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యవతులు

# ఓపీఓ తీరుపై ఓటర్ల ఆగ్రహం

- ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించాడంటూ అభియోగం
- ఓపీఓను విధుల నుంచి తొలగించిన అధికారులు

రావులపాలెం: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాల్సిన ఎన్నికల విధుల్లో ఉండే పోలింగ్ అధికారులు ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు. అధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కేంద్రంలో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ హైస్కూల్లో 64వ బూత్‌లో ఓపీఓగా విధులు నిర్వహించేందుకు వచ్చిన మలికిపురం మండలానికి చెందిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి.రాజీవ్ సోమవారం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లకు సిరాను వేలుపై పెట్టేందుకు విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో టేబుల్ పై కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న ఒక ప్రముఖ పత్రికను (సాక్షి కాదు) కింద వేసుకుని సిరా వేసే సమయంలో కూటమి పార్టీకి ఓటు వేయాలంటూ ఆ యాడ్‌ను చూపిస్తున్నాడని స్థానిక ఓటర్లు అభ్యంతర వ్యక్తం చేశారు. అతడితో వాగ్వాదానికి దిగడంతో కొంతసేపు ఆ కేంద్రంలో పోలింగ్ నిలిచిపోయింది. దీంతో రావులపాలెం తహసీల్దారు, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఓపీఓ రాజీవ్ అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలింగ్ తిరిగి కొనసాగింది. అయితే ఎన్నికల సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రావులపాలెం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మను వివరణ కోరగా గొడవ జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకుని విచారించామన్నారు. అయితే ఈనాడు పత్రికలో వచ్చిన కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న పేపర్ ను కింద వేసుకుని సిరాను పెట్టడంతో అతను ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించాడని స్థానికులు అభియోగించారన్నారు. దీంతో అక్కడ ఏ విధమైన గొడవలు జరగకుండా ఉండేలా పోలీస్ శాఖ వారు అతన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. అయితే అతనిపై చర్యలు తీసుకునే అధికారం ఆ పోలింగ్ బూత్ పీఓకు ఉందని పీఓ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.



కూటమి యాడ్ ఉన్న ఈనాడు పేపరుతో పోలింగ్ కేంద్రంలో కూర్చొన్న ఓపీఓ రాజీవ్